# ప్రజాశక్తి

గురువారం 13 ఫిబ్రవరి 2025

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

# గతం కంటే మెరుగు

◆19వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

◆48 గంటల్లో రైతుకు డబ్బులు జమ



కోటవురట్ల రైతు సేవా కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి (ఫైల్ ఫోటో)

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

అనకాపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోలు 2023 ఖరీఫ్ కంటే 2024లో కొంత మెరుగ్గావుంది. అయితే సేకరణ లక్ష్యం చేరుకొనే అవకాశాలు కన్పించడంలేదు. 2024 ఖరీఫ్‌లో పండిన ధాన్యంలో 72 సేకరణ కేంద్రాల ద్వారా 50వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇంతవరకు 6,165 మంది రైతుల నుంచి రూ.43.76 కోట్ల విలువైన 19,026 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలు డిసెంబరు మొదటి వారంలో అధికారులు ప్రారంభించారు. అప్పటి నుంచి దశల వారీగా 70 కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కశింకోట, పరవాడ మండలాల్లోని కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకురాలేదు. పండిన ధాన్యంలో కొంత తమ కుటుంబ అవసరాలకు ఉపయోగించుకోవడం, కొంత ప్రయివేటు వ్యాపారులకు అమ్మడంతో కశింకోట మండలంలో సేకరణ కేంద్రానికి వస్తాయనుకున్న ధాన్యం రాలేదు. పరవాడ మండలంలో వరి సాగు తక్కువ కావడంతో ధాన్యం సేకరణ జరగలేదు. గ్రేడ్-ఎ రకం క్వింటా రూ.2,320, సాధారణ రకం క్వింటాకు రూ.2,300 ప్రభుత్వం చెల్లిస్తోంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు 48 గంటల్లో డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకావడంతో గతేడాది కంటే కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం కొంత మేరకు పెరిగింది.

| | | |
|---|---|---|
| ధాన్యం సేకరణ కేంద్రాలు | : | 72 |
| సేకరించిన కేంద్రాలు | : | 70 |
| కొనుగోలు | : | 19,026 మెట్రిక్ టన్నులు |
| రైతులు | : | 6,165 |
| విలువ | : | రూ.43.76 కోట్లు |
| రైతులకు జమ | : | రూ.43.74 కోట్లు |

అయితే గ్రామీణ ప్రాంతంలో అత్యధిక మంది రైతులు నూర్పులు చేసిన ప్రదేశానికి వచ్చి ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారులకు అమ్మడంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న రేటు కంటే ఎక్కువ ఇవ్వడంతో పాటు తేమ వంటివి చూడకుండా కళ్లాల్లోనే వారు తీసుకున్నారు. దీంతో తమ కళ్లాలకు దూరంగా వున్న కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లకుండా కొన్న చోటనే రైతులు విక్రయిస్తున్నారు. 2023 ఖరీఫ్‌లో మిగతా 2లో..



వార్డుల్లో పర్యటిస్తున్న కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్

# పారిశుధ్య పనులు మెరుగుపరచాలి

**బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన**

**-విశాఖ జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్**

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** రోడ్లు, కాలువలలో వ్యర్థాలు లేకుండా నగరం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జివిఎంసి ప్రధాన వైద్యాధికారిని విశాఖ జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. జివిఎంసి 32, 41 వార్డులలోని జైల్ రోడ్డు, పండా వీధి, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాలలో బుధవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. జైల్ రోడ్డులో ఉన్న నైట్ ఫుడ్ సెంటర్ ప్రాంతాన్ని పరిశీలించి, వ్యర్థాలు దుకాణాల వద్ద ఉన్న డస్ట్ బిన్‌లో వేసేలా దుకాణదారులకు సూచించాలన్నారు. పండా వీధి నివాసిత ప్రాంతంలో కాలువలు రోడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. చాలా చోట్ల రోడ్లపై వ్యర్థాలు అధికంగా కనిపిస్తుండడాన్ని గమనించి పారిశుధ్య సిబ్బందిచే వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వ్యాపారస్తులు దుకాణాల వద్ద వ్యర్థాలు వేస్తే ఆ దుకాణదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం జెఎన్ఎన్‌యుఆర్ఎం.కాలనీలోని పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. క్లాప్ వాహనాల మిగతా 2లో..

## సమస్యలపై ఎయు విద్యార్థుల ధర్నా

▶ వార్తలు మెయిన్‌లో..

## తోపుడు బండ్ల తొలగింపుపై నిరసన

▶ వార్త మెయిన్‌లో..

## 'ఉక్కు' దీక్షలకు 4 ఏళ్లు

▶ వార్త మెయిన్‌లో..

## రాయగడ-విజయనగరం సెక్షన్‌లో డిఆర్ఎంల తనిఖీలు

▶ వార్త 2లో..

# సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికుల భిక్షాటన

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడానికి నిరసనగా డాబాగార్డెన్స్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం కార్మికులు భిక్షాటన చేపట్టారు. నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా హాస్పిటల్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ, గత మూడు నెలలుగా 38 మంది కార్మికులను హాస్పిటల్ యాజమాన్యం ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా తొలగించిందని తెలిపారు. దీనిపై డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు యూనియన్ తరపున ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు వీరందరినీ తిరిగి విధుల్లోకి తీసుకున్నా జీతాలు మాత్రం చెల్లించటం లేదని తెలిపారు. దీంతో కార్మికులంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు గురై, అప్పులతో పస్తులతో కాలం గడుపుతున్నారని




నినదిస్తున్న కార్మికులు

ఆవేదన వ్యక్తంచేశారు. తొలగించిన కార్మికులకు ఆర్థికంగా సాయపడగలమనే ఉద్దేశంతో ఈ భిక్షాటన చేపట్టినట్లు తెలిపారు. యాజమాన్యం బకాయి జీతాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. భిక్షాటనలో అధిక సంఖ్యలో కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

# చిరంజీవి, పవన్‌కల్యాణ్ మాయలో పడొద్దు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** మెగాస్టార్ చిరంజీవి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాయలో ఎవరూ పడొద్దని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ విజ్ఞప్తి చేశారు. ఆశీలుమెట్ట వద్దగల తన ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 70 ఏళ్ల వయసులో చిరంజీవి మతితప్పి కొత్త వేషం వేస్తున్నారన్నారు. రాజకీయాలకు దూరమని ప్రకటించి, మొన్న ప్రజారాజ్యమే జనసేనగా అవతరించిందన్నారని, అంతకు ముందు రాజకీయం చేయడానికి రాజకీయ నాయకులను కలుస్తున్నానని మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. చిరంజీవి, పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు అవసరమా అని ప్రశ్నించారు. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో కలిపి చిరంజీవి మోసం చేస్తారని తాను చెప్పినదే జరిగిందన్నారు. పవన్ కల్యాణ్ జనసేన పార్టీని బిజెపికి ప్యాకేజీ పేరుతో అమ్మేస్తారని చెప్పానని, ఇప్పుడు అదే జరుగుతుందని తెలిపారు. పవన్ కల్యాణ్

**కెఎ.పాల్**



రాజకీయ డ్రామాలో చంద్రబాబు మోసపోయాడన్నారు. పవన్ కళ్యాణ్ 2019లో సిపిఐ, సిపిఎంతో కలిసి చంద్రబాబు నాయుడును తిట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో పవన్‌కు ఒక శాతం ఓట్లు కూడా రాలేదన్నారు. చిరంజీవి పవన్ కళ్యాణ్ రోజుకో మాట మాట్లాడతారని, పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. పవన్ కళ్యాణ్ భార్యా పిల్లలు బాప్టిజం తీసుకున్నారని, ఈయనేమో సనాతన ధర్మం అంటున్నారని ఎద్దేవా చేశారు.

వచ్చే ఎన్నికల్లో బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేయడానికి పవన్ కల్యాణ్ సిద్ధమవుతున్నారని, ఇది చంద్రబాబు తెలుసుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీదే గెలుపన్నారు. అధికారంలో ఉన్న బిజెపికి చిరంజీవి, పవన్ కల్యాణ్ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**దొంగ ఓట్లతో ఢిల్లీలో గెలిచారు**

ఇటీవల ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దొంగ ఓట్లతో బిజెపి అధికారాన్ని కైవసం చేసుకుందని కెఎ.పాల్ ఆరోపించారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి, అదనంగా దొంగ ఓట్లను చేర్చి 400 నుంచి 500 ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థులు గెలిచారని పేర్కొన్నారు. బ్యాలెట్ ద్వారా ఎన్నికలు పెడితే బిజెపి అసలు రంగు బయట పడుతుందన్నారు.

మొదటి పేజీ తరువాయి..

### గతం కంటే మెరుగు

33వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని భావించి, 17వేల టన్నులు సేకరించగలిగారు. ఈ ఏడాది ఇంతవరకు 19వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో నూర్పులు పూర్తికాకపోవడంతో ఫిబ్రవరి వరకు ధాన్యం సేకరిస్తామని పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు.

### పారిశుధ్య పనులు మెరుగుపరచాలి

ద్వారా ఇంటింటా సేకరిస్తున్న చెత్తను ఎప్పటికప్పుడే తరలించి నగరం పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. ఈ పర్యటనలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఎఎంఒహెచ్ డాక్టర్ సునీల్ కుమార్, బయాలజిస్ట్ సాంబమూర్తి శానిటరీ సూపర్‌వైజర్లు జనార్దన్, కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయం శానిటరీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### మందిరాలకు బదులు సామాజిక భవనాలను నిర్మించాలి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** టిడ్కో ఇళ్ల సముదాయాల్లో మందిరాలకు బదులు అంగన్‌వాడీ, సామాజిక భవనాలు నిర్మించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం లేఖ రాసినట్లు ఆయన పేర్కొన్నారు. గత టిడిపి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా పేదల కోసం టిడ్కో సంస్థ ద్వారా వేలాదిగా ఇళ్లు నిర్మించారని, వైసిపి ప్రభుత్వ హయాంలో వీటిని పట్టించుకోలేదని తెలిపారు. కొన్ని అసంపూర్తిగా ఉండిపోయాని, వాటి నిర్మాణం పూర్తి చేసి వెంటనే నీరు, రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇళ్ల సముదాయాలలో రామాలయ నిర్మాణాలు చేపడతామని ప్రకటించారని, రాజ్యాంగం ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛ ఉందని, ప్రభుత్వ భూముల మీద మతానికి సంబంధించిన మందిరాలను నిర్మించడం రాజ్యాంగ విరుద్ధమని గతంలో సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. దేవాదాయశాఖ నిర్ణయం నిలుపుదల చేసి, సామాజిక భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరారు.

### బళ్ల నర్సింగరావుకు అంతిమ వీడ్కోలు

**ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ :** ఈస్టర్న్ నేవెల్ కమాండ్ బిఎంఎస్ వ్యవస్థాపకులు బళ్ల నర్సింగరావు అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. ఈ నెల 10వ తేదీన ఆయన మృతి చెందినప్పటికీ విదేశాలలో ఉన్న ఇద్దరు కొడుకులు బుధవారం విశాఖపట్నం చేరుకోవడంతో ఎంవివి సిటీలోని ఆయన స్వగృహం నుంచి అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. ఈస్టర్న్ నేవెల్ కమాండ్ పరిధిలో ముఖ్యంగా నావెల్ డాక్ యార్డులో నర్సింగరావు వర్క్స్ కమిటీలో సభ్యునిగా, యూనియన్ నేతగా కార్మికులకు, ఉద్యోగులకు అమూల్యమైన సేవలందించారని అఖిలపక్షాల ట్రేడ్ యూనియన్ నేతలు కొనియాడుతూ నివాళు లర్పించారు. ఐఎన్‌టియుసి నేత బి.వి.అప్పారావు అధ్యక్షతన జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో అధ్యక్షులు దేముడునాయుడు, కె.సాగర్, ఐఎన్‌టియుసి నాయకులు డి.శ్యామ్‌కృష్ణ, ఎ.శేషగిరిరావు, టి.చిరంజీవి, ఎన్.రామచంద్రరావు, బి.తాతారావు, పిట్టా శ్రీహరి, కిలపర్తి సత్యనారాయణ, జె.అప్పారావు, భోగవిల్లి నాగభూషణం, సిఐటియు నాయకులు రెడ్డి వెంకట్రావు, ఎఐడిఎఫ్ పూర్వ జెసిఎం సభ్యులు జిఎస్‌జె అచ్యుతరావు పాల్గొన్నారు.

### నూతన రహదారిపై అభ్యంతరం

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** జివిఎంసి 98వ వార్డు పరిధి అడవివరం ప్రాంత రైతులు, ప్లాట్ యజమానులు తరఫున గత ఏడాది డిసెంబర్ 10వ తేదీన జారీ చేసిన ఆర్‌డిపి ప్రణాళికలో ప్రతిపాదిత 8 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి తాము అభ్యంతరం తెలియజేస్తున్నామని వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం బుధవారం వియంఆర్‌డిఎ కార్యాలయంలో చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఆర్‌డిపి ప్రాజెక్ట్ ద్వారా ఆస్తి నష్టం జరుగుతుందని, అడివివరం ప్రాంత భూముల యజమానులకు మేలు కలిగేలా చేపట్టాలని కోరారు. ఈ ప్రాంతంలో భూములు కోల్పోయే ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, న్యాయంగా నష్ట పరిహారం అందించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునరావాసం కోసం టిడిఆర్ మంజూరు చేయాలని కోరారు. అడవివరం రైతులు, ప్లాట్ యజమానుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే అడవివరం ప్రాంత ప్రజలంతా కలిసి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని స్పష్టంచేశారు.

# 14న తాగునీటికి అంతరాయం

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:** జివిఎంసి రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టిఎస్ఆర్‌కు మంచినీటి సరఫరా జరుగు ప్రధాన 1000 ఎంఎం పిఎస్‌సి పైపులైను ఆర్ అండ్ బి ఆఫీసు ఎదురుగా గల అంబేద్కర్ కల్యాణమండపం దగ్గర లీకుల మరమ్మతులు చేపట్టేందుకు ఈ నెల 14వ తేదీన జోన్ 3, 5, 8 లోని పలు ప్రాంతాలలో తాగునీటికి అంతరాయం కలుగుతుందని జివిఎంసి మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మంచినీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. జోన్-3లోని డాక్టర్స్ కాలనీ, ఎంఎంటిసి.కాలనీ, ఎపిఎస్ఇబి.కాలనీ, అంబేద్కర్‌నగర్, పి అండ్ టి కాలనీ, గాంధీ నగర్ ఏరియా, రామకృష్ణానగర్, శంకరమఠం మెయిన్ రోడ్డు, చాకలిపేట, లలితానగర్, చైతన్య నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్‌హెచ్-16 రోడ్డు, కెప్టెన్ లైన్ ఏరియాస్, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, 80 అడుగుల రోడ్డు, జోన్-5లో లక్ష్మీనారాయణపురం-1, 2, లెపర్స్ కాలనీ, కస్తూరినగర్-1, శాంతినగర్-1, 2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జైప్రకాష్ నగర్, మహాత్మాగాంధీ నగర్, ఇందిరానగర్ 2 నుంచి 5, బాపూజీ నగర్, పెద్దకొత్తూరు, అరుంధతినగర్, రాంజీఎస్టేట్, మాధవధార, మాధవధార వుడా లే-అవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం వుడా లే-అవుట్, ఎన్జీజీవోస్ కాలనీ, కంచరపాలెం, కరాస, గ్రీన్ గార్డెన్స్, శివనగర్, జ్యోతినగర్, పార్వతీనగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హుస్సేన్ నగర్, ఆర్‌పి.పేట, జోన్-8లో లక్ష్మీనగర్ ఎఫ్.బ్లాక్ పార్కు, సి.డి. బ్లాక్ పార్కు, శ్రీనివాసనగర్, ఆర్ఆర్‌వి.పురం రజక కాలనీలకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

**జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు**




రక్తదాన శిబిరం ప్రారంభంలో జిల్లా ప్రజా రవాణాధికారి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం ఎపిఎస్ఆర్‌టిసి విశాఖపట్నం డిస్పెన్సరీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలలో ఎక్కువమంది రక్తం పోవడంతో మరణిస్తున్నారని, అటువంటి వారిని రక్తదానంతో కాపాడవచ్చని తెలిపారు. శిబిరంలో ఆర్‌టిసి కార్మికులు రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. రక్తదాతలకు ఆయన ఫ్రూట్ జ్యూస్ ప్యాకెట్లు అందజేశారు. 42 మంది సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.వాణి నీలిమ, రోటరీ క్లబ్ వైద్యులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ అశోక్, అసిస్టెంట్ మేనేజర్ జి.వి.గౌరి, అసోసియేషన్ నాయకులు, డిస్పెన్సరీ సిబ్బంది, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# రాయగడ-విజయనగరం సెక్షన్‌లో డిఆర్‌ఎంల తనిఖీలు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్ కుమార్ సాహూ, రాయగడ డిఆర్ఎం అమితాబ్ సింఘాల్, ఇతర సీనియర్ అధికారులతో కలిసి బుధవారం రాయగడ-విజయనగరం సెక్షన్ సమగ్ర భద్రతా తనిఖీ, సౌకర్యాల సమీక్ష నిర్వహించారు. మొదటగా రాయగడ స్టేషన్‌లో సౌకర్యాలు, సిబ్బంది వసతి, మౌలిక సదుపాయాల మెరుగుదల, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, విశ్రాంత గదులు తదితరాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం లడ్డా-జిమిడిపేట సెక్షన్, గజపతినగరం-కోమటిపల్లి సెక్షన్లోని లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. అనంతరం పార్వతీపురంలో స్టేషన్ అభివృద్ధి పనులతో పాటు యార్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. సీతానగరం స్టేషన్‌ను పరిశీలించారు. ప్రధాన వంతెనలను పరిశీలించి, గర్డర్లు వంటి భద్రతపై పలు సూచనలు చేశారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్ఎంలు

విజయనగరం యార్డును పరిశీలించారు. రాయగడ నుంచి విజయనగరం వరకు విండో ట్రెయిలింగ్ ద్వారా ఈ తనిఖీ నిర్వహించారు.

# శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీని బుధవారం లెక్కించారు. జనవరి 4వ తేదీ నుంచి బుధవారం వరకు 37 రోజులకు హుండీ ద్వారా నగదు రూ.33,13,320, బంగారం 091 గ్రాముల 100 మిల్లి గ్రాములు, వెండి 831 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ వచ్చినట్లు దేవస్థానం కార్య నిర్వహణాధికారి శోభారాణి తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో శోభారాణితోపాటు ఇన్‌స్పెక్టర్ సిద్ధార్థ, ఎవిఎన్ కళాశాల యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్, పోలీసులు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయి ఇంజినీరింగ్ బృందం అభివృద్ధే లక్ష్యం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** భారతదేశంలో ఎన్ ఫ్యాబ్రికా ప్రపంచ స్థాయి ఇంజినీరింగ్ బృందాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా హైదరాబాదులో ఎన్ ఫ్యాబ్రికా ఆర్ అండ్ డి కేంద్రం ప్రారంభించినట్లు ఆ సంస్థ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీజీత్ ముఖర్జీ మీడియాకు తెలిపారు. సిలికాన్, సాఫ్ట్‌వేర్ ప్రాడక్ట్ అభివృద్ధి కార్యకలాపాలను విస్తరించడానికి అనువైన వేదికను అందించటం ఈ కేంద్రం ఉద్దేశమని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రతిభావంతులైన నిపుణులతో అత్యాధునిక ఎఐ నెట్‌వర్కింగ్ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో ముందంజలో నిలవనుందన్నారు. జనరేటివ్ ఎఐ వినియోగం వేగంగా పెరుగుతుందని తెలిపారు.

### 16న కుంభమేళాకు ప్రత్యేక బస్సు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** కుంభమేళాకు వెళ్లి వచ్చే వారికోసం ఈ నెల 16వ తేదీన విశాఖపట్నం ద్వారకా బస్సుస్టేషన్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. టికెట్ రూ.8 వేలుగా నిర్ణయించామని, టికెట్లు కావలసినవారు ఆన్ లైన్ ద్వారా గానీ, సమీప బస్ స్టేషన్‌లో గానీ పొందవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9052227083, 9959225602, 9959225594, 9100109731 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### హిట్ అండ్ రన్ కేసులు పరిష్కరించాలి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** హిట్ అండ్ రన్ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన 'హిట్ అండ్ రన్ నష్టపరిహారం కేసులు సత్వర పరిష్కారం కోసం' బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. హిట్ అండ్ రన్‌కు సంబంధించిన కేసుల వివరాలను జనరల్ ఇన్స్యూరెన్స్ కౌన్సిల్‌కు జాప్యం లేకుండా పంపించాలన్నారు. నష్టపరిహారం, క్లెయిమ్ దరఖాస్తులలో లోపాలు ఉంటే సంబంధిత అధికారులు వాటిని సరిచేసి పరిష్కరించా లన్నారు. సమావేశంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిపాలనా యంత్రాంగం ప్రత్యక్షంగా, అల్లూరి సీతారామరాజు జిల్లా అధికార యంత్రాంగం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సమావేశంలో విశాఖపట్నం, భీమిలి ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, కె.సంగీత్ మాధుర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి, విశాఖపట్నం రవాణా కమిషనర్ సిహెచ్ శ్రీనివాస్, అనకాపల్లి రవాణా శాఖ డిఎస్‌పి బి.మోహనరావు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికుల సమావేశం

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జోన్ -3 జనరల్ సెక్రటరీ, జెఆర్.నాయుడు ఆధ్వర్యాన 18వ వార్డు ఎంవిపి కాలనీలో పారిశుధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ, ఈ నెల 6వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దు చేస్తూ దళారి వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు వార్తలు వస్తున్నాయని, ఆప్కాస్ రద్దు చేస్తే కాంట్రాక్ట్ / అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కార దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి తప్ప కాంట్రాక్టర్లకు మేలు కలిగేలా, కార్మికులను బాధ పెట్టేలా ఉండకూడదన్నారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షులు టి.నూకరాజు, వరలక్ష్మి, విజయ, గోపి, హేమలత పాల్గొన్నారు.

### మహిళల భద్రతలో విఫలం

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించడంలో అధికార ప్రభుత్వం విఫలమైందని వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి విమర్శించారు. వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిది నెలల్లోనే 300కు పైగా లైంగిక దాడుల కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హోం మంత్రి సొంత జిల్లాలోనే 22 లైంగిక వేధింపుల కేసులు నమోదైనా ఎలాంటి చర్యలూ లేవన్నారు. తిరుపతిలో జనసేన నేత కిరణ్ రాయల్ వేధించారంటూ బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, పోలీసులు ఆమెను మరింత వేధింపులకు గురిచేశారని ఆరోపించారు.

# దశాబ్దాల నాటి వృక్షాలపై గొడ్డలి వేటు!

- తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చెట్ల తొలగింపుపై విమర్శలు
- నిలువ నీడ దూరం చేశారని పలువురి ఆవేదన

**ప్రజాశక్తి-సీతమ్మధార:** పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలన్న సంకల్పంతో చాలామంది ముందుకు వస్తుంటే, వాటిని ప్రోత్సహించాల్సిన అధికారులు దశాబ్దాల నాటి మహావృక్షంపై గొడ్డలివేటు వేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో ఆవరణలో దశాబ్దాలుగా ఉన్న చెట్లను నామరూపాలు లేకుండా నాశనం చేసిన తీరుపై ఆరోపణలు వస్తున్నాయి.

1985లో పోర్టు ఆర్థికసాయంతో అర్బన్ తహశీల్దార్ కార్యాలయాన్ని నిర్మించారు. అప్పటికే దశాబ్దాల నాటి పెద్ద మర్రి చెట్లు ఆ కార్యాలయం ఆవరణలో ఉండేది. ఆ చెట్లు కింద ఎంతోమంది సేదదీరే వారు. నక్కవానిపాలంగా ఏర్పడక ముందునుంచే ఉన్న ఆ చెట్లు ప్రత్యేక ఆకర్షణగా ఉండేవి.

ఇటీవల అర్బన్ తహశీల్దార రమేష్ పర్యవేక్షణలో వీటిపై గొడ్డలి వేటు వేశారు. అత్యవసర పరిస్థితుల్లో చెట్లను తొలగించాల్సి వస్తే వాటిని కూకటివేళ్లతో పెకలించి, వేరొకచోట నిలబెట్టే అధునాతన సాంకేతిక అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఉన్న చెట్లన్ను ఏకంగా తొలగించడం విడ్డూరంగా ఉందని పలువురు అంటున్నారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటైన తర్వాత గడచిన నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ తహశీల్దార్లుగా విధులు నిర్వర్తించిన వారంతా కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించేందుకు తమదైన శైలిలో కృషి చేస్తూ వచ్చారు.కానీ ప్రస్తుత తహశీల్దార్ రమేష్ దశాబ్దాల నాటి చెట్లను నామరూపాల్లేకుండా నేలపాలు చేయడం ఏంటని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయం సమీపంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఉన్నచెట్లను తొలగించారనే ఆరోపణ లున్నాయి.. దానికి సంబంధిత అటవీ, జివిఎంసిల నుంచే కాక కలెక్టర్ నుంచి అనుమతులేమైనా ఉన్నాయా? లేకుంటే అవేవీ లేకుండా తొలగించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొట్టిన చెట్ల దుంగలను ఏం చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ విక్రయిస్తే ఆ నగదును ప్రభుత్వఖాతాకు జమ చేశారా? లేదాయస? అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయానికి వివిధ పనులపై వచ్చేవారితోపాటు కార్యాలయ సిబ్బంది సేదదీరేందుకు, వేచి ఉండేందుకు అనుకూలంగా, ఆహ్లాదకరంగా ఉన్న చెట్లను తొలగించడంపై పలువురు మండిపడుతున్నారు. ఇపుడు చెట్లు నరికేయడంతో నిలువనీడ కరువైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నారు. అవసరం ఏదైనా దశాబ్దాల నాటి మహావృక్షాలను కూకటి వేళ్లతో పెకిలించి, చదును చేసిన తీరుపై పలువురు ఆవేదన వ్యక్తం చేయడం విశేషం. దీనిపై స్థానిక తహశీల్దార్ స్పందించి వివరణ ఇవ్వాల్సి ఉంది.



మహావృక్షాలను నరికేసి, చదును చేసిన తహశీల్దార్ కార్యాలయ ఆవరణ

## నేరాలు ఘోరాలు

### దారి దోపిడీ కేసులో ముగ్గురు అరెస్ట్

**- చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : మండలంలోని దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో సోమవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై వెళ్లి దారిదోపిడీకి పాల్పడ్డ ఘటనలో ముగ్గురు నిందితులను స్థానిక నేర విభాగం పోలీసులు బుధ వారం అరెస్ట్ చేశారు. క్రైమ్ ఎస్సై ఎస్.సూర్య ప్రకాశరావు కథనం ప్రకారం.. విజయనగరం దాసన్నపేట ‌ ‌ చెందిన కాళ్ళ లీలా వరప్రసాద్ చిప్పాడ దివీస్‌లో ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ కంపెనీ హాస్టల్‌లో ఉంటున్నారు. స్నేహితులు సిరా రామకృష్ణ, కొంచాడ రాంబాబుతోకలిసి సోమవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో లీలా వరప్రసాద్ రఘు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన ఆగి మూత్ర విసర్జనకు వెళ్తుండగా , భీమిలి మండలం దాకమర్రికి చెందిన కంటుభు క్త శ్రీను, కనకల యశ్వంత్, దాకమర్రి జంక్షన్ కు చెందిన ముగడ శివ పల్సర్ బైక్‌పై వచ్చి ముగ్గుర్నీ డబ్బులు ఇమ్మని బెదిరించడమే కాకుండా కొట్టారు. లీలా వరప్రసాద్ వద్ద నుంచి రూ 1000 లు లాక్కున్నారు. అంతటితో ఆగకుండా అతని స్నేహితుడు రామకృష్ణ మొబైల్ ఫోన్‌లో బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసి, ఎటిఎం ద్వారా విత్ డ్రా చేసి తేవాలని బెదిరించారు. రామకృష్ణ మార్గమధ్యలో రోడ్డు సేఫ్టీ సిబ్బందికి జరిగిన విషయం తెలియజేసి, తిరిగొచ్చేసరికి నిందితులు పరారయ్యారు.

బాధితుల్లో ఒకరైన లీలా వర ప్రసాద్ ఫిర్యాదు మేరకు, నేర విభాగం పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ 1000లు, పల్సర్ బైక్, ఆటో స్వాధీనం చేసుకున్నారు.ఎస్సై సూర్య ప్రకాశరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నేరం జరిగిన కొద్ది గంటల్లోనే నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసిన ఎస్ఐ సూర్య ప్రకాశ రావు, సిబ్బంది ఎం శివ, ఎం రాజేష్, గౌరి నాయుడులను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

### డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : విశాఖ నుంచి బీచ్ రోడ్డు మీదుగా భీమిలి వస్తున్న కారు స్థానిక మార్లిన్‌కే హోటల్ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది..బుధ వారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. విశాఖ నగరంలోని వేపగుంట జంక్షన్‌కు చెందిన మండల గణేష్ ఇద్దరు మహిళలతో కలిసి కారులో బీచ్ రోడ్డులో భీమిలి అతివేగంగా వస్తుండగా మార్లిన్ కే హోటల్ మలుపు వద్ద కారు అదుపు తప్పి డివైడ ర్ ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలోకారు దెబ్బతింది. అయితే కారు డ్రైవ్ చేస్తున్న గణేష్‌కు గానీ, అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలకు గానీ ఎటువంటి గాయాలు కాలేదు. గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి -తగరపువలస** : తాళ్లవలస 11కెవి రూరల్ ఫీడర్ నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా పనుల ఈ నెల 14న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మూడవ జోన్ ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు

తాళ్లవలస, రాయినిపేట, ఎరుసుపేట, వలందపేట, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. భీమిలిలో వెల్లంకి, వేములవలస ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్ల నిర్వహణకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జెవి అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కృష్ణా కాలనీ, బిళ్లలమెట్ట తది తర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**మధురవాడ:** మధురవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని రేవళ్లపాలెం 11కెవి ఫీడర్‌లోనిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. వల్లినగర్, మధురవాడ హైస్కూల్ ఏరియా, రేవళపాలెం విలేజ్, పోలీస్ స్టేషన్, వల్లినగర్, ఎఎస్ఆర్ అవుట్‌లెట్, భాస్కర్ నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## తారకరామ కల్యాణ మండపం పనులు చేపట్టాలి

**ప్రజాశక్తి -గాజువాక** : పారిశ్రామిక ప్రాంతం తుంగ్లాంలో తారకరామ కల్యాణమండప నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి పూర్తిచేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బివి.రామ్ డిమాండ్ చేశారు.. బుధవారం సమావేశంలో మాట్లాడుతూ. 1995లో అప్పటి విశాఖ ఎం.పీ ఎంవివిఎస్.మూర్తి ఎంపీల్యాడ్స్‌తో నిధులతో ప్రజల అవసరానికి దీన్ని నిర్మించారన్నారు. కాలక్రమేణా మరమ్మతులకు గురైన దీన్ని ఆధునికీకరించేందుకు గతేడాది మార్చి 12న అన్ని అనుమతులతో జివిఎంసి పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. గుర్తింపు పొందిన ఎస్ఎన్.ఎంటర్‌ప్రైజెస్‌కు నిర్మాణ కాంట్రాక్టు బాధ్యతలను అప్పగించి, పునాదులు తవ్వేందుకు సిద్ధపడుతున్న తరుణంలో పనులను నిలుపుదల చేశారన్నారు. కల్యాణమండప ప్రాంతంలో చెరువు ఉందన్న సాకుతో అనుమతిచ్చిన జివిఎంసి అధికారులే దీన్ని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. సిఇగా శివప్రసాద్ రాజు బాధ్యతలు చేపట్టిన తర్వాతే పనులను ఆటంకం ఏర్పడిందని రామ్ ఆరోపించారు. గతంలో ఎన్టీఆర్ అభిమానులు, బాలకష్ణ అభిమానులు కళ్యాణమండపం నిర్మాణ పనులలో ప్రత్యక్షంగా పాల్గొన్నారన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నియోజకవర్గంలోనే పనులను అధికారులు అడ్డుకుంటుంటే, మిగతా చోట్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తక్షణమే పనులు ప్రారంభించకుంటే సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో కాకి శ్రీదేవి, నావన సింహాచలం, పెట్లి అర్జున్, బలంకి అప్పారావు, డాక్టర్ శ్రీనివాస్, మజ్జి రాజు, ఎంఎల్.పి.రాజు పాల్గొన్నారు.

## గణేష్‌కు అభినందన



గణేష్‌ను అభినందిస్తున్న కాలేజీ డైరెక్టర్ సుధారాణి

**ప్రజాశక్తి -ఆనందపురం:** ఢిల్లీ గణతంత్ర పరేడ్‌లో పాల్గొన్న గుడిలోవ ఎక్యుజె కళాశాల ఎంసిఎ సెకెండియర్ విద్యార్థి గణేష్‌ను బుధవారం కాలేజీలో అభినందించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ పి సుధారాణి మాట్లాడుతూ చదువుతోపాటు సేవా కార్యక్రమాలలో ముందుండే గణేష్ అందరికీ ఆదర్శనీయుడన్నారు.. ఈ సందర్భంగా నెల రోజులు గణతంత్ర పరేడ్‌లో తన అనుభవాలను తోటి విద్యార్థులకు గణేష్ వివరించారు.

## 15 నుంచి19 వరకు ఆయుర్వేద పంచకర్మ వైద్యశిబిరం

**ప్రజాశక్తి-సీతమ్మధార** :దీర్ఘకాల రోగాలకు ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా చికిత్స అందించేందుకు ఈనెల 15 నుంచి 19 వరకు కేరళకు చెందిన ప్రసిద్ధ వైద్యులచే ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కెఎం. ఉనినకృష్ణన్ అయిదు రోజుల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన) , ఆర్థరైటీస్ (కీళ్ళ వ్యాధులు ), పక్షవాతం, ఊబకాయం, ఆస్మా, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసికఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో సేవలు అందిస్తారన్నారు. వివరాలు, అపాయింట్‌మెంట్‌కు రామ్‌నగర్ జివిఎంసి ఎదురుగా ఉన్న తమ కేంద్రంలోగానీ, 8008000670, 9030568264 నెంబర్లకు సంద్రించాలన్నారు. 15,16,17 తేదీల్లో మురళీనగర్ శ్రీదేవి పార్క్ వద్ద, 18,19 తేదీల్లో రామ్‌నగర్ ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని కేంద్రంలో సేవలు పొందవచ్చని సూచించారు.

## వినియోగదారుల హక్కుల రక్షణకు కృషి

**ప్రజాశక్తి- సీతమ్మధార** : వినియోగదారుల హక్కులపై వారికి అవగాహన కల్పించి, వాటి రక్షణకు కృషి చేస్తానని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఎపి వైస్ చైర్మన్ విశ్వనాథం యాదవ్ అన్నారు. కమిషన్ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నేషనల్ చైర్మన్ సాయి రమేష్ నుంచి రాక్ష్మి వైస్‌చైర్మన్‌గా నియామకపత్రాలు, గుర్తింపు కార్డులను పొందారు. కమిషన్ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా ఆదినారాయణ రాజు నియమితులయ్యారు.

ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ దోపిడికి గురికాకుండా వనిఇయోగదారులకు వారి హకుకలపై అవగాహన కల్పిస్తానన్నారు. తనకీ బాధ్యతలు అప్పగించిన జాతీయ చైర్మన్ సాయి రమేష్, సౌత్ ఇండియా చైర్మన్ దాడి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరాజు, నేషనల్ డైరెక్టర్ దిలీప్‌రాజ్, సౌత్ ఇండియా జాయింట్ సెక్రటరీ సన్యాసిరావు, డివిజన్ చైర్మన్ షరీఫ్, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : మండలంలోని టి నగరపాలెంలో ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మతు పనులను ఎట్టకేలకు చేపట్టారు. కొన్నేళ్లుగా కనీస నిర్వహణ, మరమ్మతులు లేక అధ్వానంగా తయారైన రహదారులకు ఎట్టకేలకు బాగు చేస్తుండడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్

**ప్రజాశక్తి- సీతమ్మధార** సీతమ్మధార రైతు బజార్ వద్ద ద్వారక ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు ఈ సందర్భంగా ద్వారక ట్రాఫిక్ సిఐ ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. రైతుబజార్‌ను ఆనుకుని రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానా విధించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు ద్వారక ట్రాఫిక్ ఎస్ఐ ప్రతాప్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

## రైతులందరూ గుర్తింపు సంఖ్య పొందాలి

**ప్రజాశక్తి -ఆనందపురం** : ఫార్మర్ రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేసుకుని రైతులందరూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయాధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకూ ఒక ఐడి జనరేట్ చేసి, దాని ఆధారంగా పథకాలన్నీ అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ప్రతి రైతు ఆధార్ కార్డు, భూమి 1బి రికార్డు, ఆధార్ లింక్ అయినా మొబైల్ నెంబర్‌తో ‌రైతు సేవా కేంద్రంలో సంప్రదించి ఫార్మర్ ఐడిని జనరేట్ చేసుకోవాలన్నారు ఈనెలాఖరు తర్వాత ఈ ఐడి ఉన్న రైతులకు మాత్రమే పిఎం కిసాన్, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులందరూ గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో అవసరమైన పత్రాలను తీసుకెళ్లి, ఫార్మర్ ఐడి నమోదు చేసుకోవాలన్నారు.

## గీతం దూరవిద్య కోర్సులలో ప్రవేశానికి
# వచ్చే నెల 31 వరకు గడువు పెంపు

**ప్రజాశక్తి -మధురవాడ** : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో ఎంఎ ఇంగ్లీష్, బిఎ, బికాం డిగ్రీ కోర్సులలో 2025 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఇఒ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు తెలిపారు. పూర్తి చేసిన ధరఖాస్తులను వచ్చేనెల 31లోగా అందజేయాలన్నారు. పూర్తి సమాచారానికి దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు cdl.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలిం చాలని సూచించారు.


## జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు



అచ్యుతరావును సత్కరిస్తున్న చిరంజీవి కళాపీఠం

**ప్రజాశక్తి- సీతమ్మధార** : విశాఖలో వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి రూ.10 లక్షలతో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్(ఎపిజెయు) సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు వెల్లడించారు .బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో . చిరంజీవి కళాపీఠం ఆధ్వర్యంలో ఎపిజెయు గౌరవాధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ కంచర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపకార్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలను చేపడుతున్న తనకు జర్నలిస్టలంటే ఎనలేని అభిమానమని, అందుకే వారి సంక్షేమానికి, ఆరోగ్యభరోసాకు ఈ నిధిని ఏర్పాటు చేశానన్నారు. జర్నలిస్టుల హౌసింగ్, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు ఇతర సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిషాకరానికి కృషి చేస్తానన్నారు ఎపిజెయు రాష్ట్ర ప్రతినిధి పి.బాలభాను, విశ్రాంత ఎడిసిపి ఖాన్, ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొని అచ్యుతరావుకు శు

## విన్నకోట రాముకు ఘన సత్కారం



రామును సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

**ప్రజాశక్తి- పెందుర్తి** : అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల అధ్యక్షులు విన్నకోట రాము అన్నారు. బుధవారం జివిఎంసి 97వ వార్డు చిన ముషిడివాడ వుడా కాలనీలో రాము స్వగృహంలో ఆయనను కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు కాలనీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

అనంతరం రాము మాట్లాడుతూ ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి, అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ కైపు వెంకటకృష్ణారెడ్డి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. షిప్‌యార్డులో ఎఐటియుసిలో పనిచేసిన అనుభవంతో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి, కాంగ్రెస్ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తానన్నారు. అన్ని కార్మిక సంఘాలతో కలిసి, సమస్యలపై పోరాట కార్యాచరణ రూపొందిస్తానన్నారు కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఎం. కోటేశ్వరరావు, నాయకులు ముక్క రామునాయుడు, ఆర్ ఆర్ నాయుడు, బి. భానుమూర్తి, కాళ్ల సత్యనారాయణ, కొండలరావు, బొంత రమణ, పిడిది మధు, ఎంవిఆర్ పాత్రుడు, ఎస్. సుబ్రహ్మణ్యం, ప్రకాశరావు, మల్లేశ్వరరావు, సన్యాసిరావు పాల్గొన్నారు

## ప్రశ్నించి, పోరాడే సత్తా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి
# విజయగౌరిని గెలిపించాలి
### యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఉపాధ్యాయ ఓటర్లతో మాట్లాడుతున్న యుటిఎఫ్, ప్రజాసంఘాల నేతలు

**ప్రజాశక్తి- పద్మనాభం** : ప్రశ్నించి, పోరాడే సత్తా ఉన్నవారిని గెలిపిస్తే సమస్యలు పరిష్కారానికి ఆస్కారముంటుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అంబేద్కర్ అన్నారు. ఈనెల 27న జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. బుధవారం మండలంలోని మద్ది, అనంతవరం, గంధవరం, పద్మనాభం. రెడ్డిపల్లి, విజయానందపురం, బిఆర్ తాళ్లవలస, రేవిడి, పాండ్రంగి గ్రామాల్లో పాఠశాలల్లో ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం మొండిగా ఉన్నప్పటికీ, పోరాడి అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాథమిక విద్యను విచ్ఛిన్నం చేయడానికి కుట్ర చేస్తోందన్నారు.ప్రభుత్వం అనుకున్నది జరిగితే గ్రామ స్థాయిలో పేదలకు ప్రాథమిక విద్య దూరమౌతుందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో సమస్యలపై ప్రశ్నించి, పోరాడే స్వభావం ఉన్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. చుక్కరామయ్య నుంచి పిడిఎఫ్ అభ్యర్థులంతా ప్రతిపాదించి, బలపరిచిన కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర నియోజకవర్గంలో పోటీలో ఉన్నారని, ఆమెను గెలిపించి, శాసనమండలికి పంపిద్దామని పిలుపునిచ్చారు. రాజకీయపార్టీల మద్దతుతో పోటీలో ఉన్న అభ్యర్థులను గెలిపిస్తే, ఆయా పార్టీలకు మద్దతుగా ఉంటారే తప్ప, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యాసమస్యలపై పోరాడే ఆస్కారముండదన్నారు. జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ప్రజల కోసం మాట్లాడే వ్యక్తులు లేకపోతే పాలకులు ఇష్టరాజ్యంగా పాలన సాగిస్తారన్నారు. కార్మిక పోరాటంతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై నాలుగేళ్లుగా ప్రభుత్వాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయన్నారు. విద్య, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే సత్తా, ప్రభుత్వాలను నిలదీసి ప్రశ్నించే ధైర్యం ఉన్న పిడిఎఫ్ తరపున పోటీలో ఉన్న విజయగౌరిని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.సత్యనారాయణ రెడ్డి కె. సన్యాసిరావు సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

## పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ
# టెండర్లు రద్దు చేయాల్సిందే
### 135వ రోజుకు నిరసన దీక్షలు



నిరసన దీక్షల్లో పాల్గొన్న పోర్టు ఉద్యోగులు, కార్మికులు, సిఐటియు నేతలు

**ప్రజాశక్తి- సీతమ్మధార** : వాయిదాలు వేస్తూ వస్తున్న విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రయివేటీకరణ టెండర్లను పూర్తిగా రద్దు చేయాల్సిందేనని పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షుడు పద్మనాభరాజు స్పష్టం చేశారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం 135వ రోజు నిరసన దీక్షలో మాట్లాడుతూ, టెండర్లకు వచ్చేవారికి అడ్డుకోవడం కాదని, వారిని తరిమికొడదామని పిలుపునిచ్చారు. 40వేల మంది పోర్టు ఉద్యోగులు, కార్మికులతోపాటు వారి కుటుంబాల ఆరోగ్యంతో ముడిపడిఉన్న పోర్టు అసుపత్రిని అభివృద్ధి పేరుతో ప్రయివేటుకు కట్టబెట్టాలనుకోవడం అనైతిక మన్నారు. వేలాదికోట్ల రిజర్వ్‌ఫండ్స్, భూములు ఉన్న విశాఖ పోర్టు ఏటా జివిఎంసి రూ.65కోట్ల పన్నులు కడుతోందని, ఆ నిధులతోనే గ్రేటర్ విశాఖ పరిధిలో పలు అభివృద్ధి పనులు, సమస్యలను పరిష్కరిస్తుండగా, అటువంటిది పోర్టు ఆసుపత్రి అభివృద్ధికి సొంత నిధులు లేవాయని ప్రశ్నించారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. సిఐటియు నేతలు కె. సత్య నారాయణ, జె.సత్యనారాయణ, సిహెచ్ త్రినాధరావు, గణేష్, రెడ్డి ఈశ్వరరావు, నాయుడు పాల్గొన్నారు.

# కాలుష్యం నుంచి కాపాడండి

- బొగ్గు నిల్వల యార్డును తక్షణమే తొలగించాలి
- ఆటోనగర్‌లో పెదగంట్యాడ వాసుల ఆందోళన



బొగ్గు నిల్వల యార్డుల వద్ద ఆందోళన చేస్తున్న పెదగంట్యాడ వాసులు

**ప్రజాశక్తి -గాజువాక**: పెదగంట్యాడ ఆటోనగర్లో పరిశ్రమల స్థానంలో కాలుష్యంతో నిండిన బొగ్గు నిల్వ యార్డ్‌లను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పెదగంట్యాడ గ్రామ ప్రజలు యార్డ్‌ల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ నిర్మాణ సమయంలో పెదగంట్యాడ, ఆటోనగర్ సంబంధించి భూములు తీసుకున్న ఎపిఐఐసి, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు 200 బ్లాకులుగా విభజించి, ఇచ్చిందన్నారు. అందులో పరిశ్రమల ఏర్పాటుతోపాటు స్థానికులకు ఉపాధి కల్పిస్తారన్న సంకల్పంతో భూములను ఇస్తే, ఇపుడు కాలుష్యంతో నిండిన బొగ్గు నిల్వల యార్డులను ఏర్పాటు చేయడందుర్మార్గమన్నారు. యార్డు నుంచి వెలువడుతున్న బొగ్గు దుమ్ము,ధూళి కాలుష్యంతో అనారోగ్యం పాలై ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే బొగ్గు నిల్వల యార్డ్‌ను ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## రహదారి భద్రతపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బుచ్చిరాజు

**ప్రజాశక్తి -తగరపువలస** : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంవిఐ బుచ్చిబాబు మాట్లాడుతూ, బైక్ ప్రయాణంలో హెల్మెట్, కారులో వెళ్లేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు.సురక్షిత ప్రయాణానికి వేగపరిమితులు పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ పిఒ షరీఫ్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు

## జెఇఇ మెయిన్స్‌లో
# శశి విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి -తగరపువలస** : జెఇఇ మెయిన్స్ సెషన్స్,1 జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్థానిక సంగివలస శశి క్యాంపస్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో పలువురు విద్యార్థులు మంచి పర్సంటైల్ సాధించారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తెలిపారు పాకలపాటి హర్షవర్ధన్ 99.9 పర్సంటైల్, మీసాల హరితేజ 99.88, బి బాలఅనిక్ 99.59, పి శ్రావణ్ 99.52, ఆర్ మౌళి 99.45, యస్.యతిన్ అశిస్ 99.33, డి స్టీఫెన్ 99.23, జి తులసీరామ్ 99..18, పి సాయిగణేష్ 99.14, జె సుజిత్ సత్య విఘ్నేష్ 99.12 పర్సంటైల్ సాధించారని తెలిపారు వీరితో పాటు 99 పర్సంటైల్ పైబడి 13 మంది, 98 పైబడి 28 మంది, 97 పైబడి 49మంది, 96 పైన 62 మంది, 95 పర్సంటైల్‌పైన 76 మంది సాధించారని పేర్కొన్నారు. ఇందుకు కారణమైన విద్యార్థినీ విద్యార్థులను, అధ్యాపకులను చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు కార్యదర్శి మేకా క్రాంతిసుధ అభినందనలు తెలిపారు

## పేదలకు దుప్పట్లు, ఆహారం వితరణ



దుప్పట్లు అందజేస్తున్న ఆనంద్ మార్గ్ సభ్యులు

**ప్రజాశక్తి - ఆరిలోవ** :నీలకంఠ దివాస్ వేడుకలను పురస్కరించుకొని పాతడెయిరీఫారం, ఇందిరానగర్‌లో ఉన్న ఆనంద్ మార్గ యూనివర్సల్ రిలీఫ్ బృందం బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలో సామాజిక ధ్యానం అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, కాన్వెంట్‌జంక్షన్, ఇందిరానగర్, తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు, బిస్కెట్లు, మంచినీటి బాటిళ్లను ఆనంద్‌మార్గ్ జిల్లా కమిటీ సభ్యులు అందజేసారు. ఆచార్య సౌమ్యానంద అవదూత ఆధ్వర్యంలో ఆచార్య త్రిలోకేశానంద, వసుంధర, కమిటీ సభ్యులు ఆర్ఎ.పాత్రో, చలం, రమేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**ప్రజాశక్తి-సీతమ్మధార** : జివిఎంసి 47వ వార్డు కంచరపాలెం సంపత్ వినాయక పార్వతీశ్వర సాయి ఆలయం రజతోత్సవ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు, తిక్కవానిపాలెం కాలనీ, స్థానిక సంక్షేమ సంఘం పెద్దలు సతీష్ ను సాధారంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి, మెమొంటో బహూకరించారు. ఆలయ అధ్యక్షులు గనకళ్ల శంకర్, వానపల్లి అప్పన్న, కోలా చంటి, గరికిన పరశురాం, సూరాడ కోటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రేమించి పెళ్లి చేసుకొని ముఖం చాటేశాడు

- భర్త ఇంటి వద్ద బాధిత యువతి, కుటుంబ సభ్యుల ధర్నా
- అండగా నిలిచిన సిఐటియు నేతలు
- న్యాయం చేస్తామన్న పోలీసులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ప్రేమించి, పెళ్లి చేసుకుని కొన్నాళ్లు కాపురం చేసి తన కుటుంబ సభ్యులకు ఈ పెళ్లి ఇష్టం లేదని చెప్పి ఓ యువకుడు ముఖం చాటేశాడు. దీంతో బాధిత యువతి సిఐటియు నాయకుల సహకారంతో బుధవారం ఆ యువకుడి ఇంటి ముందు ధర్నా చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... కె.కోటపాడు మండలం రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన గుదే సురేష్ విశాఖపట్నం మధురవాడ ప్రాంతానికి చెందిన కాశీ స్వాతి ఇద్దరు కృష్ణా డిగ్రీ కాలేజీలో కలిసి చదువుకున్నారు. చదువుకునే రోజుల్లోనే ఇరువురు ప్రేమించుకుని కొన్నాళ్ల తర్వాత మధురవాడ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెళ్లి చేసుకున్నారు. అక్కడే ఒక ఇల్లు అద్దెకు తీసుకొని కొద్దికాలం కాపురం చేశారు. 2024 అక్టోబర్ 9న ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లిన సురేష్ తిరిగి రాలేదు. తన కుటుంబ సభ్యులకు ఈ పెళ్లి ఇష్టం లేదని, తన తల్లిదండ్రులను ఒప్పించుకొని వస్తానని, అప్పటివరకు వేచి ఉండాలని ఫోన్లో చెబుతుండేవాడు. కొద్దికాలం తర్వాత సురేష్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేయడంతో స్వాతి ఇల్లు ఖాళీ చేసి తన కన్నవారింటికి చేరింది. ఈ విషయమై తనకు న్యాయం చేయాలని స్థానిక సిఐటియు నాయకులను స్వాతి ఆశ్రయించింది. దీంతో సిఐటియు నాయకులు బుధవారం స్వాతిని వెంటబెట్టుకొని రొంగలినాయుడుపాలెంలోని సురేష్ ఇంటికి వచ్చారు. స్వాతికి న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ సురేష్ ఇంటి ముందు ధర్నా చేశారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులను విడగొట్టడం న్యాయం కాదని, వారిద్దరినీ ఒకటి చేయడానికి సహకరించాలని సురేష్ తండ్రి కొండబాబును సిఐటియు నాయకులు కోరారు. తన ఇంటి వద్ద ధర్నా చేసి ఇబ్బంది కలిగిస్తున్నారని కొండబాబు కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి వచ్చిన పోలీసులు స్వాతికి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. స్వాతికి న్యాయం జరిగే వరకూ తాము వదిలిపెట్టేది లేదని సిఐటియు నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజ్ కుమార్, గండి నాయన బాబు, ఎర్ర దేవుడు, స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సురేష్ ఇంటి ముందు ధర్నా చేస్తున్న స్వాతి, ఆమె కుటుంబ సభ్యులు



సంతోష్‌ను సత్కరిస్తున్న జిమ్ నిర్వాహకులు

## మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్‌లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి

శ్రీకాకుళంలో ఈనెల 9వ తేదీ జరిగిన 30వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్-2025 పోటీలలో 70 కేజీల విభాగంలో అనకాపల్లికి చెందిన పి.సంతోష్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం అనకాపల్లి అవినాష్ పవర్ జిమ్‌లో సంతోష్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవినాష్ పవర్ జిమ్ ఛైర్మన్, న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుతూ యువత శారీరక దారుఢ్యంపై అవగాహన పెంచుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని కోరారు. సంతోష్ అనతి కాలంలోనే మిస్టర్ ఆంధ్ర పోటీలలో పాల్గొని మొదటి స్థానాన్ని కైవసం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంతోష్‌ని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది శారీర దారుఢ్య పోటీల్లో పాల్గొని అనకాపల్లికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. జిమ్ మేనేజర్ గొర్లి స్వామి గౌడ్ మాట్లాడుతూ అవినాష్ పవర్ జిమ్ నుండి ఇప్పటికే అనేక మంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని మంచి ఫలితాలు సాధించారన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి నిత్యం శారీరక శ్రమ సాధన ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ న్యాయవాది అవినాష్ ఇళ్ళ, బుద్ద గణేష్, పినపాత్రుల సంతోష్, దొడ్డి వెంకటరావు, అయినాల కృష్ణ, డి.హేమంత్, లాలం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 17న పాల రైతుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** విశాఖ డెయిరీ పాల రైతుల సమస్యలపై అనకాపల్లి జిల్లా పాల రైతుల సంఘం ఆధ్వర్యాన ఈ నెల 17న ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవు పాల ధర తగ్గింపు, ఆవు వెన్న శాతం పెంపు, 30 లీటర్ల కంటే తక్కువ సేకరిస్తున్న కేంద్రాలను నిలుపుదల చేయడం వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి పాల రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు హాజరవుతారని, తప్పనిసరిగా సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

## రేపు విద్యుత్ అంతరాయం

**ప్రజాశక్తి-సబ్బవరం :** సబ్బవరం డి-2 సెక్షన్స్, 33/11 కెవి అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పిఎంఐ వర్క్ కారణంగా ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల అంతకాపల్లి సబ్ స్టేషన్, అంతకాపల్లి ఫీడర్ పరిధిలోని అంతకాపల్లి, రావులమ్మపాలెం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అడ్డూరు, గొట్టివాడ, లగిశెట్టిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మహిళా హక్కులపై అవగాహనా సదస్సు

**ప్రజాశక్తి-సబ్బవరం :** స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం న్యాయ సేవా కేంద్రం సభ్యులు బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మహిళా హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు వైవిధ్యభరితమైన నాటక ప్రదర్శనలతో మహిళా హక్కులపై వినూత్నంగా అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.సుధా మాట్లాడుతూ ఆడవారిపై చాలా పెద్ద బాధ్యత ఉంటుందని, తమ పిల్లలను తమ కాళ్ళ మీద తాము నిలబడేలాగా తీర్చిదిద్దాల్సి ఉందని చెప్పారు. ఆడ పిల్లలకు ఏ సమస్యనైనా ఎదుర్కొనే ధైర్యం అందివ్వాలని సూచించారు. లా వర్సిటీ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీలత, న్యాయ సేవా కేంద్రం సభ్యులు సిహెచ్.లక్ష్మి, భావనేశ్వరి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

# ప్రసూతి, శిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఒక్క ప్రసూతి, శిశు మరణాలు సంభవించినా, ప్రసూతి కేసులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేసిన సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ హెచ్చరించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రసూతి, ప్రసూతి, శిశు మరణాల కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. జూలై నుండి డిసెంబర్ వరకు జిల్లాలో ప్రసూతి తల్లుల మారణాలు, నవజాత శిశు మరణాలు సంభవించగా, వాటిపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా మరణాలకు కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ఇకనుంచి జిల్లాలో ఒక్క ప్రసూతి, శిశు మరణం కూడా సంభవించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని విడనాడాలని, మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. మరణాల తరువాత సమీక్షించడం కంటే, వాటిని సంభవించకుండా అరికట్టడమే మనకు అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రయివేటు ఆసుపత్రి వాళ్ళు చికిత్స చేయగల సమర్థ్యం ఉంటేనే చికిత్స చేయాలన్నారు. లేని యెడల వెంటనే చికిత్స లభించే ఆసుపత్రులకు తరలించాలని సూచించారు.. వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఏమరుపాటుగా ఉన్నా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ఇంత యంత్రాంగం ఉండికూడా మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, అంగన్‌వాడీలు ఉండికూడా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. జరుగుతున్న మరణాల్లో 90శాతం వరకు అరికట్టదగినవేనని ఆమె స్పష్టం చేశారు. ఇకనుంచీ ఎక్కడైనా ప్రసూతి, శిశు మరణం సంభవిస్తే, సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోనని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ పి.రవికుమార్, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డిఐఒ డాక్టర్ చంద్ర శేఖర్, డిపిహెచ్ఎన్ఓ నాగమణి, ఎన్‌టిఆర్ ఆసుపత్రి డాక్టర్లు, సిహెచ్‌సి, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎమ్‌లు, ఆశ వర్కర్లు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## 15న ఎన్‌టిపిసి రీజనల్ ఎలక్ట్రాన్ క్విజ్

**ప్రజాశక్తి-పరవాడ :** దేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పవర్ యుటిలిటీ అయిన ఎన్టీపీసి కంపెనీ తన 50వ సంవత్సరాల వేడుకల సందర్భంగా ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ అయిన రీజనల్ ఎలక్ట్రాన్ క్విజ్-2025ని ఈ నెల 15న చెన్నైలో నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిపిసి అధికారులు తెలిపారు. చెన్నైలోని ఎంఎంఎ ఆడిటోరియంలో జరగనున్న దక్షిణాది ప్రాంతీయ రౌండ్‌కు ఉత్తేజకరమైన బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. విజేత జట్టుకు రూ.30వేలు, రన్నరప్‌కు రూ.20 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు, నాలుగు నుండి ఆరు స్థానాల్లో నిలిచిన జట్లకు కన్సోలేషన్ బహుమతి రూ.4వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రాంతం నుండి మొదటి రెండు జట్లు 3 జాతీయ సెమీ-ఫైనల్స్‌కు చేరుకుంటాయని, తరువాత, ప్రతి సెమీ-ఫైనల్ నుండి మొదటి రెండు స్థానాలు జాతీయ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయని తెలిపారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ప్రతి బృందంలో ఇద్దరు సభ్యులు ఉంటారని చెప్పారు. జ్ఞానాన్ని పెంపొందించడం, విమర్శనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం, అకాడెమియా, దాని వాస్తవ ప్రపంచ అనువర్తనం మధ్య అంతరాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 2004 నుండి నిర్వహిస్తున్న ఎన్టీపీసీ ఎలక్ట్రాన్ క్విజ్, మేధో పరాక్రమాన్ని ప్రదర్శించడానికి ఒక వేదిక అని తెలిపారు. ఆసక్తిగల బృందాలు తమ రిజిస్ట్రేషన్‌ను electronquizntpcsouth@gmail.comకి పంపవచ్చని పేర్కొన్నారు.



బహుమతులు అందజేస్తున్న బత్తుల తాతయ్యబాబు

## వ్యాసరచన పోటీల్లో వడ్డాది విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి-వడ్డాది :** శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు వారు నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో వడ్డాది విద్యార్థి ప్రతిభ కనబరిచారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది జెడ్పి హైస్కూల్ నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వారికి రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ మెడివాడ రమణ, దొండా నరేష్, సిరిగిరిశెట్టి శ్రీరామ్ మూర్తి, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చార్లెస్ డార్విన్ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి-చోడవరం :** జీవ పరిణామక్రమ సిద్ధాంతకర్త చార్లెస్ డార్విన్ జయంతి వేడుకలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఐవీవీ సత్యవతి, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ జీవపరిణామ క్రమాన్ని డార్విన్ ప్రపంచానికి అందించారని, ఆయన కృషి ఎనలేనిదని కొనియాడారు. జీవశాస్త్రం, జీవపరిణామ సిద్ధాంతం మొదలగు జీవశాస్త్ర అంశాలలో చార్లెస్ డార్విన్ జరిపిన విస్తృత పరిశోధనలు గూర్చి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రత్న భారతి పాల్గొన్నారు.



క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న వైసిపి నేత భరత్ కుమార్

## మృతుల కుటుంబాలకు భరత్ పరామర్శ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కొత్తపల్లి, జి.భీమవరం, పరవాడపాలెం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట వైసిపి నాయకులు కలగా గున్నయ్యనాయుడు, మలసాల కిషోర్, గొల్లివిల్లి శ్రీనివాసరావు, నమ్మి గణేష్, సర్పంచ్‌లు హనుమంతు వెంకట, చిరికి సన్యాసినాయుడు, కొట్టే రాము, ఎంపిటిసిలు అల్లం శంకర్, దుంగల నాయుడు, అద్దింకి సతీష్, లగిశెట్టి గణేష్, చెల్లిబోయిన మురళి తదితరులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

## రైతు రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రీలో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామ సచివాలయంలో జరుగుతున్న రైతుల నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం వల్ల వారికి ఆధార్ తరహాలోనే ఒక ప్రత్యేక నెంబర్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు. దీనివలన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే పిఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు పొందడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో రైతులు ఇందులో నమోదయ్యేటట్లు చూడాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో సాంకేతిక లోపాలు కనిపిస్తున్నాయని వాటిని త్వరలోనే సరి చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

## పేద రోగులకు ఉచిత బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం విఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్డి సత్యారావు ఆధ్వర్యంలో తగరపువలస ఎన్ఆర్ఐ అనిల్ నీరుకొండ హాస్పిటల్‌లో ఉచిత వైద్య సేవల కోసం పేదలను తీసుకెళ్లడానికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన 30 మంది రోగులను బుధవారం రావికమతం నుండి బస్సులో తీసుకెళ్లారు. ఈ ఉచిత వైద్య సేవలు కోసం వచ్చిన వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. వీరిలో ముగ్గురికి కంటి, ముగ్గురిని గైనిక్, ముగ్గురికి ఆర్థో, ఇద్దరికి ఈఎన్టీ, ఏడుగురికి జనరల్ ట్రీట్మెంట్ ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. ప్రతి బుధవారం ఈ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ వడ్డి సత్యారావు తెలిపారు. ఈ వైద్య సేవలు పొందడానికి వచ్చే వారు తప్పకుండా ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకురావలని కోరారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.




బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

## పెదనాయుడు చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-సబ్బవరం

రాయపూర్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ హైవే జాతీయ రహదారి130 నిర్మాణం వల్ల నష్టం జరుగుతున్న సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు పెదనాయుడుపాలెం పెదనాయుడు చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామరాజు చెప్పారు. జాతీయ రహదారి నిర్మాణంలో పెదనాయుడు చెరువు భూ గర్భం సుమారు రెండున్నర ఎకరాలు కలిసిపోవడంతో ఆయకట్టు రైతులు తమ పంట పొలాలకు సాగునీరు తగ్గిపోయే ప్రమాదముందని ఆందోళనతో ఇటీవల హైవే నిర్మాణ పనులు అడ్డుకున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పెదనాయుడు చెరువు ఆయకట్టు రైతులతో సీతారామరాజుతో పాటు హైవే ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్, జాతీయ రహదారి సైట్ ఇంజనీర్ పవన్, కాంట్రాక్టర్ సైట్ ఇంజనీర్ రామకృష్ణ, స్థానిక ఇరిగేషన్ ఏఈ సాయి కిరణ్ తదితరులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామరాజు మాట్లాడుతూ రైతుల డిమాండ్లను పరిష్కరించి, హైవేలో విలీనమైన చెరువు భూగర్భం సుమారు రెండున్నర ఎకరాలు భూమికి బదులుగా ప్రైవేటు భూమిని సేకరించి చెరువులో కలుపుతామని హామీ ఇచ్చారు. పెదనాయుడు చెరువు అలుగు నీరు బొర్రమ్మ గెడ్డకు తరలిపోయేటట్లు ఏర్పాటు చేస్తామని, పోతరాజు చెరువు నుండి వచ్చే అలుగునీరు బొర్రమ్మ గెడ్డకు మళ్ళిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రాజెక్టు పూర్తికి రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కోటాన అప్పారావు ఆయకట్టు రైతుల తరపున వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆదిరెడ్డి పోతరాజు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న కొటాన అప్పారావు, రైతులు

## ముగిసిన ఉమామహేశ్వరి తీర్థ మహోత్సవాలు



ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో శ్రీఉమామహేశ్వరి దేవి (తీర్థ) కళ్యాణ మహోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ నెల 8న భీష్మ ఏకాదశి రోజున ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఐదు రోజులు దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ఆధ్వర్యంలో తీర్థ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి గ్రామ శివారులో జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో పదిమంది విజేతలకు రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు, రూ.14 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని దేవరాపల్లిలోని పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ మందుగుండు సామాగ్రి, కోలాటాలు, తప్పిడిగుళ్ళు, మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. చివరి రోజు భారీ సంఖ్యలో భక్తులు, బంధువులు, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలి రావడంతో దేవరాపల్లి రద్దీగా మారింది. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై టి. మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

### ఘనంగా బండిమాంబ తీర్థ మహోత్సవం

సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామదేవత శ్రీబండిమాంబ అమ్మవారి రెండు రోజుల తీర్థ మహోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గ్రామ సర్పంచ్ గండి అరుణ, టీడీపీ యువ నాయకులు గండి వంశీ దీప్, సీనియర్ టీడీపీ నాయకులు తమరాన బంగారునాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంగటి నానాజీ, నెక్కల శ్రీను, గండి దేవుళ్ళు, లైన్మెన్ నాయుడు, బైలపూడి రాంబాబు, రాళ్లపల్లి బండయ్య, సింగంపల్లి అప్పలనాయుడు, మేడపాటి రాము, వెన్నెల శంకర్, గురి బండయ్య, గురి నాయుడు, బైలపూడి తులసి, గురి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



సింహాచలం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామానికి చెందిన కొడమంచిలి సింహాచలం మతిస్థిమితం సరిగా లేక జనవరి 27 నుండి కనిపించడం లేదు. గత నెల 27న సింహాచలం వేచలం నుండి టౌన్ కొత్త రోడ్డు వెళ్లే 333 నెంబర్ గల బస్సు ఎం.అలమండలో ఎక్కారని, ఆయన ఎక్కడికి వెళ్లాడో నేటికీ తెలియ రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన వెళ్లిన రోజు వైట్ కలర్ పైజామా, పంచ కట్టుకొని ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆయన కుమారుడు కొడమంచిలి చిన్నబాబు దేవరాపల్లి, విశాఖలోని ఆరిలోవ, పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సింహాచలం ఆచూకీ తెలిస్తే 8985880977 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని 83వ వార్డు పరిధిలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన వ్యక్తి దహన సంస్కారాలకు వైసిపి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సూచన మేరకు ఆ పార్టీ నాయకులు జాజుల రమేష్ బుధవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఏఎంసీ కాలనీలో కొంత కాలంగా సోమధుల శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి మలసాల భరత్‌కుమార్ 5 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించాలని సూచించారు. వెంటనే జాజుల రమేష్ దహన సంస్కారాల నిమిత్తం మృతుని కుటుంబానికి అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ఎం.అలమండ సర్పంచ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండలం ఎం.అలమండ గ్రామ పంచాయతీ సర్పంచ్ దాడి జగన్నాథరావు (జగన్) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దాడి జగన్నాథరావును ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మూడు నెలల పాటు సస్పెండ్ చేయగా, ఆయన హైకోర్టును ఆశ్రయించడంతో ఈ సస్పెన్షన్‌పై కోర్టు స్టే ఇచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సర్పంచ్ బాధ్యతలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నుంచి ఆదేశాలు రావడంతో బుధవారం జగన్నాథరావు బాధ్యతలు స్వీకరించారు

## సదరం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కంటి సమస్యలు ఉండి సదరం సర్టిఫికెట్లు ఉన్న వికలాంగులు పెన్షన్ల కోసం ఈనెల 11 నుండి 13 వరకు అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆకుల ఫౌండేషన్ అధినేత ఆకుల నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ ద్వారా పెన్షన్లు పొందుతున్న బుచ్చియ్యపేట మండలంలోని 60మంది కంటి విభాగానికి చెందిన వికలాంగులను కంటి డాక్టర్స్ తనిఖీ చేస్తారని, అర్హత ఉన్నవారికి మాత్రమే మార్చి నెల నుండి యధావిధిగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఆరువేలు రూపాయలు అందిస్తారని తెలిపారు. అనర్హులకు పెన్షన్ మార్చి నెల నుండి ఆగిపోతుందని, కాబట్టి స్థానిక సచివాలయం ద్వారా నోటీస్ అందినవారు ఈ వైద్య పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

## అందుబాటులోకి ఆయుర్వేద వైద్య సేవలు

ప్రజాశక్తి-దేవరాపల్లి


మండల కేంద్రంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్య సేవలు పున:ప్రారంభమయ్యాయి. దేవరాపల్లిలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కొంతకాలంగా మూతపడింది. గత నెలలో ఆయుష్ డిపార్ట్మెంట్ ఆయుర్వేద వైద్యరాలు జి.గ్రీష్మను నియమించడంతో ప్రస్తుతం ఆయుర్వేద వైద్య సేవలు మండల ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఆయుర్వేద వైద్యం ద్వారా అన్ని రకాల వ్యాధులను నయం చేసుకోవచ్చని డాక్టర్ గ్రీష్మ తెలిపారు. పాత ఎంపీడీవో భవనంలో ఆయుర్వేద వైద్యశాల నిర్వహిస్తున్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ గ్రీష్మ

## నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు తొయత్సు రేర్ ఎర్తస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు బుధవారం ఆహార దినుసులు అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోయిచి సెటొ, జనరల్ మేనేజర్ మురళి పట్నాయక్‌ను సత్కరించారు. తోటి వికలాంగులకు సేవలు అందిస్తున్న జాతీయ అవార్డు గ్రహీత పిఎస్ టి పట్నాయక్ సమాజానికి ఆదర్శనీయుడని కొనియాడారు. పట్నాయక్ మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులు కొన్ని సంవత్సరాలుగా సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు చెప్పారు.



ఆశ్రమ విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

రహదారుల నిర్మాణ పనులకు..

# పంచాయతీ ట్రాక్టర్ వినియోగం !

**ప్రజాశక్తి చీడికాడ:** పంచాయతీలో పారిశుధ్యం తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాక్టర్ ప్రజా అవసరాలకు వినియోగించకుండా రహదారుల నిర్మాణానికి, ఇసుక సిమెంట్ తరలింపుకు వినియోగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

చీడికాడ మండల కేంద్రంలో పంచాయతీకి ఇటీవల ప్రభుత్వం టాక్టర్ మంజూరు చేసింది. ఈ ట్రాక్టర్ పై గ్రామంలో ఉన్న చెత్తాచెదారం డంపింగ్ యార్డ్ కు తరలించేందుకు ఉపయోగించాల్సి ఉంది. నిబంధన ప్రకారం పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు ఉపయోగించాలి తప్ప ఇతరత్రా పనులకు ఉపయోగించరాదు. అయినప్పటికీ మండల కేంద్రంలో పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్‌తో రహదారుల నిర్మాణానికి సిమెంట్, ఇసుక తరలించడమే కాకుండా ట్రాక్టర్ ఇంజన్‌కు ట్యాంకర్ పెట్టి గ్రావెల్ రహదారులను నీటితో తడిపేందుకు వినియోగిస్తున్నారు. ఇదే కాకుండా సిమెంట్ రహదారులకు నీటిని తరలించేందుకు సైతం పంచాయితీ ట్రాక్టర్ను వినియోగించడంపై గ్రామానికి చెందిన బిజెపి నేత రెడ్డి కొండబాబు తీవ్రంగా వ్యతిరేకించారు. పంచాయతీకి ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్ రహదారుల నిర్మాణానికి ఉపయోగించడం ఏంటని, ప్రైవేట్ ట్రాక్టర్లు పెడితే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని భావించి పంచాయతీ ట్రాక్టర్లో డీజిల్ పోసి తమ సొంత పనులకు ఉపయోగిస్తున్నారని దీనిపై ఎంపీడీవో కు తహసిల్దార్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

ఈ విషయమై పంచాయతీ విస్తరణ అధికారి కామేశ్వరావును వివరణ కోరగా నిబంధన ప్రకారం పంచాయతీ ట్రాక్టర్‌ను కాంట్రాక్ట్ పనులకు వినియోగించ రాదని, ఈ విషయం తన దృష్టికి రాలేదని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.


పంచాయతీ ట్రాక్టర్‌లో తరలిస్తున్న సిమెంట్


మాట్లాడుతున్న ఎఒ

## రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**ప్రజాశక్తి -కోటవురట్ల:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజిని సూచించారు. బుధవారం ఆమె మండలంలోని చౌడువాడ గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు, ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు, అదేవిధంగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సహా వివిధ ఉత్పత్తులను పొందేందుకు ఈ రిజిస్ట్రేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు నిర్లక్ష్యం చేయకుండా చేయించుకోవాలని సూచించారు


బోరు నీటిని తోడుతున్న గ్రామస్తులు

## బోరు మరమ్మతు పనులు

**ప్రజాశక్తి- రావికమతం:** మండలంలో కవగుంట గ్రామం నూకాలమ్మ చెరువు సమీపంలో చేతిబారు మరమ్మతును బుధవారం చేపట్టారమని సర్పంచ్ దాసరి సూర్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఈ బోరు సమీపంలో సుమారు 20 పశువుల పాకలు ఉన్నాయన్నారు. పశు వులకు, మేకలకు, పంట పొలాలకు, జీడి మామిడి తోటలకు వెళ్లే రహదారి కావడంతో ఈ బోరు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ చంద్రన రామనాయుడు, బర్నికాన గంగరాజు, మాజీ వార్డ్ మెంబర్ ఈపు ఆప్పారావు కృష్ణ పాల్గొన్నారు.

## కల్యాణపులోవలో ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

**ప్రజాశక్తి-కొత్తకోట:** ఉత్తరాంధ్ర జిల్లాలో పేరుందిన కళ్యాణపులోవ పోతురాజు బాబు తిరునాళ్లకు ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 26, 27,28 తేదీలలో మూడు రోజుల పాటు నిర్వహించే తిరునాళ్లకు సుమారు మూడు లక్షల మంది భక్తులు హాజరవుతారు. ఈ కళ్యాణపులోవ జలాశయంలో స్నానాలు ఆచరించి కళ్యాణ పోతురాజు బాబు, పెద్దింటమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆర్ డబ్ల్యూఎస్ జెఈ భగవంతరావు మాట్లాడుతూ మహా శివరాత్రి తీరు నాళ్ళు లో భాగంగా ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం మండల పరిషత్తు నిధులు రూ 25 లక్షలతో మరో నాలుగు స్నాన ఘట్టాలను నూతనంగా నిర్మిస్తున్నామన్నారు. గతంలో నిర్మించిన పాత స్నాన ఘట్టాలకు అను సంధానం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెఇ

చేస్తున్నట్టు పేర్కొన్నారు. దీంతో భక్తులకు మరింత సేవలు అందుబాటులోకి రానున్నాయని, ఇప్పటికే 60శాతం పనులు పూర్తి అయినట్టు ఆయన తెలిపారు...

## సాలికమల్లవరంలో 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని సాలికమల్లవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయా ధికారి కే.సుధారాణి మాట్లాడుతూ, భూ వివరాలను రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకోవాలని సూచిం చారు. 25వ తేదీలోగా మాత్రమే అవకాశం ఉందని, వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోగుంపేట రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ సత్యవేణి, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎఒ

## బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

**ప్రజాశక్తి- కొత్తకోట:** విద్యార్థులకు బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై ఆడియో, వీడియో ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ మహిళా పోలీస్ కిరణ్ కుమారి మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బాల్యవివాహాలతో కలుగు అనర్థాలు, సైబర్ నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించామని ఆమె తెలిపారు. రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో తట్టబంద, తోటకూరపాలెం జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులతో పాటు , కొత్తకోట పోలీసుస్టేషన్ పరిధిలో జెడ్పీ హైస్కూల్, అర్క్ బర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించామని చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్


నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఔదార్యం

### -స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని ఏఎల్.పురం ఎస్టీ కాలనీకి చెందిన నర్సె శ్రీను గత నెల 27న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు 2007 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం శ్రీను తల్లిదండ్రులు నర్సె వెంకన్న, చిన్నబుజ్జికి రూ.45వేలు ఆర్థిక సహాయం అందించారు. ఇప్పటికే వారి బ్యాచ్‌లో కష్టాల్లో ఉన్న తోటి విద్యార్థులకు సాయం అందించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలు సరిచేసిన సిబ్బంది

**ప్రజాశక్తి-రోలుగుంట:** మండలంలోని కొవ్వూరు గ్రామంలో ఇటీవల ఓ లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో మూడు స్తంభాలు నెల కొరిగాయి. గ్రామ స్థుల ఫిర్యాదు మేరకు బ ం ద. వా ం ం విద్యుత్‌శాఖ సిబ్బంది ఈ స్తంభాలను సరి చేశారు. అనంతరం వైరింగ్ పనులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


సరి చేస్తున్న సిబ్బంది

## వైభవంగా శోభాయాత్ర

**ప్రజాశక్తి -నక్కపల్లి:** నక్కపల్లి వీవర్స్ కాలనీలో సుబ్రహ్మణ్యం, ఆంజనేయ స్వామి నూతన ఆలయాల ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా చేపట్టిన శోభాయాత్ర వైభవం గా జరిగింది. ఉపమాక వెంకన్న ఆలయం నుంచి నక్కపల్లి వీవర్స్ కాలనీలో నూతనం గా నిర్మాణం చేపట్టిన ఆలయాల వరకు పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలు, ప్రతిష్ట విగ్రహాలతో శోభాయాత్ర చేపట్టారు. శనివారం విగ్రహాల ప్రతిష్ట, అన్న సమారాధన చేపట్టనున్నారు.


యాత్ర చేపడుతున్న భక్తులు

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**ప్రజాశక్తి -నక్కపల్లి:** పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బుధవారం జరుగుతున్న కాలువల పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు మురికి కాలువలో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ, గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులతో కాలువలు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి సత్యంకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు ప్రబలి రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ప్రజలు రోగాలు బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. రాజయ్యపేట సచివాలయాన్ని ఎంపీడీవో సీతారామరాజు సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందించే సేవలను విస్తతం చేయాలని సిబ్బందికి సూచించారు. పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.


మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

### మధ్యాహ్నం భోజనం తనిఖీ

**నక్కపల్లి:** మండలంలోని రాజయ్యపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. భోజనాన్ని రుచి చూశారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణరావు, కార్యదర్శులు సత్యం, జయప్రకాష్ పాల్గొన్నారు.

## తూనికల్లో తేడాలు వస్తే చర్యలు

**ప్రజాశక్తి-గొలుగొండ:** తూనికల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని నర్సీపట్నం తూనికలు కొలతలు శాఖ అధికారి అనురాధ హెచ్చరించారు. బుధవారం మండలంలోని జోగుంపేట కిరాణా షాపులను ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తూనికల్లో ఎటువంటి అక్రమాలకు పాల్పడవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని దుకాణాదారులను హెచ్చరిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తూకం సరిగ్గా ఉందా లేదో పరిశీలించుకోవాలని సూచించారు.


తనిఖీలు చేస్తున్న అనురాధ

## సినీ ఫక్కీలో మోసం

**- ఏటిఎం కార్డు మార్చి రూ.30వేల నగదు విత్ డ్రా**

**-పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు**

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :**డబ్బు కొట్టేయాలంటే కేటుగాళ్లకు సవాలక్ష మార్గాలు ఉన్నాయి. ఇందులో భాగంగానే స్థానిక ఎస్బీఐ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తి తన కార్డు పిన్ నంబర్ చూసి కార్డు మార్చేసి రూ.30 వేలు దోచుకున్నట్లు బాధితురాలు ఫాతిమా వాపోయింది. తన తల్లి ఆపరేషన్ కోసం రూ.1.6 లక్షలు అప్పుగా తీసుకున్నామన్నారు. రూ.30 వేలు డ్రా చేసిన సమయంలో కార్డు కాజేసి రూ.10 వేలు ఏటీఎం ద్వారా, మరో రూ.20 వేలు పెట్రోల్ బంక్ లో కార్డు స్వైప్ చేసి కొట్టేశాడని బాధితురాలు ఫాతిమా తెలిపారు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. పిన్ నంబర్ చూసి కార్డు మార్చేశాడని బాధితురాలు ఫాతిమా తెలిపారు.



నర్సీపట్నం ఎస్బీఐ ఏటీఎంలో కార్డు మార్చిన ఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్ఐ రమేశ్ బుధవారం తెలిపారు. బాధితురాలు వరుసగా మూడుసార్లు రూ. 10 వేలు తీసిన క్రమంలో వెనకే ఉన్న నిందితుడు బాధితురాలి ఏటీఎం కార్డు పిన్ నంబర్ గుర్తు పెట్టుకున్నాడన్నారు. బాధితురాలు డబ్బులు తీసుకుంటున్న నేపథ్యంలో నిందితుడు ఏటీఎం కార్డు చాకచక్యంగా మార్చేశాడని పేర్కొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా

**- ఏడు మెడల్స్ సాధించిన క్రీడాకారులు**

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** ఆంధ్ర ప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం లో ఈనెల 11, 12న రైల్వే స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా బాక్సింగ్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ లో నర్సీపట్నం బాక్సింగ్ అకాడమీకి చెందిన మహిళా క్రీడాకారులు 7 మెడల్స్ సాధించారని శాప్ కోచ్ అబ్బు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిని ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా సెక్రటరీ శ్రీనివాస్‌రావు, రైల్వేస్ సెక్రటరీ రెడ్డీ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ సెక్రటరీ లక్ష్మణ్ దేవ్ అభినందించారు. శాప్ కోచ్ అబ్బు శిక్షణ, పర్యవేక్షణ బాగుందని కితాబు నిచ్చారు.



ప్రారంభిస్తున్న హోం మంత్రి

## టిడిపి కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి -నక్కపల్లి:**నక్కపల్లిలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం హెూం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ నివాస ప్రాంత సమీపంలో ఇటీవల టిడిపి నూతన కార్యాలయం నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు హెూం మంత్రి అనిత కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. పురోహితులు కార్యాలయం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా భూరీసర్వే చేపట్టాలి

**-జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్-గంధవరం, అనంతరం గ్రామాల్లో సుడిగాలి పర్యటన**

**ప్రజాశక్తి -పద్మనాభం :** భూరీసర్వేను గ్రామాల్లో సమగ్రంగా, పారదర్శకంగా చేపట్టి, సర్వే వివరాలను రైతుల ముందు ఉంచాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం మండలంలోని అనంతవరం, గంధవరం. గ్రామాల్లో ఆకస్మిక సుడిగాలి పర్యటన చేశారు. అనంతవరం, గంధవరం గ్రామాల్లో రీసర్వే, ఈపంట ప్రక్రియలను పరిశీలించారు.

ముందుగా గంధవరంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్న రీసర్వే ప్రక్రియను పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. డ్రోన్, రోవర్‌ల సాయంతో రీసర్వే జరిగిన తీరును సునిశితంగా పరిశీలించారు. సర్వే పూర్తయిన తర్వాత గ్రామసభ నిర్వహించి, పూర్తి వివరాలను రైతుల ముందు ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైతుల వినతులను, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకొని అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా స్థానిక రైతులతో వివిధ అంశాలపై కలెక్టర్ కాసేపు మాట్లాడారు. రీసర్వే, ఈపంట, ఇతర సేవలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రీసర్వే వివరాలను, నివేదికలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు తప్పులు లేకుండా వివరాలను నమోదుచేసి, నివేదికలను పొందుపరచాలని సూచించారు.

**సూపర్‌చెక్‌తో ఈపంట నమోదు పరిశీలన**

తర్వాత అనంతవరం గ్రామంలో పర్యటించి, క్షేత్రస్థాయిలో పొలాల్లో జరుగుతున్న ఈపంట ప్రక్రియను పరిశీలించారు. రబీ సీజన్‌కు వివిధ పంటల నమోదులో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖలు నిర్వహించిన ఈపంట నమోదు కార్యక్రమాన్ని సూపర్ చెక్ యాప్ ద్వారా లాగిన్ అయ్యి సంబంధిత వివరాలను సరిచూశారు క్షేత్ర స్థాయిలో వాస్తవాలకు అనుగుణంగా ఉన్నాయా లేవాయని పరిశీలించారు. అనంతవరంలో అపారిశుధ్యాన్ని పరిశీలించి, క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టేలా చూడాలని ఎంపిడిఒ ఎం.విజయకుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

**గంధవరం గ్రామ సచివాలయ ఆకస్మిక తనిఖీ**



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

మండల పర్యటనలో భాగంగా గంధవరం గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టికను చూసి సమయపాలన పాటించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. సేవలను మరింత వేగవంతం చేయాలన్నారు. పర్యటనలో జిల్లా వ్యవసాయాధికారి కె అప్పలస్వామి, తహశీల్దార్ కె ఆనందరావు ఎంపిడిఒ విజయ్‌కుమార్, ఎఒ బివి.చలం, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంఆర్ఐ లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు,

# జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ**

**శ్రీరామానుజ విద్యార్థుల ప్రతిభ**

పెదవాల్తేరులోని శ్రీరామానుజ జూనియర్ కళాశాల విద్యార్థులు ఐఐటి జేఈఈ మెయిన్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివరామ దత్తాత్రయ తెలిపారు. విద్యార్థి ఉజ్వల్ 98.619 శాతం పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు. తమ విద్యార్థులు ఫిజిక్స్‌లో 97.057, కెమిస్ట్రీలో 99.717, మ్యాథ్స్ 98.309 పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉజ్వల్‌తో పాటు 95 శాతం పర్సంటైల్ సాధించిన ముగ్గురు విద్యార్థులను కళాశాల యాజమాన్యం సత్కరించింది. తమ విద్యార్థులకు జేఈఈ రెండో సెషన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

### ఎసెంట్ విద్యార్థుల అద్భుత ప్రదర్శన

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థులు ర్యాంకుల పరంపర కొనసాగించారు. కళాశాలకు చెందిన కౌసల్ హిరావత్ 99.89 పర్సంటైల్, కాగితపల్లి వాసవీప్రియ 99.86 పర్సంటైల్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. 99 పర్సంటైల్ మార్కులతో 16 మంది, 98 పర్సంటైల్‌తో 28 మంది, 95 పర్సంటైల్‌తో 62 మంది, 90 పర్సంటైల్ మార్కులతో 110 మంది అర్హత సాధించినట్లు ఆయన వెల్లడించారు.



KAUSHAL HIRAWAT
App.No. 250310547199
99.8964539



K. VASAVI PRIYA
App.No. 250310333537
99.8606111

### శ్రీవిశ్వ విద్యార్థుల సత్తా

శ్రీ విశ్వ జూనియర్ కళాశాలకు చెందిన 212 మంది విద్యార్థులు ఎన్ఐటి, ఐఐటీల్లో సీటు పొందే మార్కులు సాధించినట్లు సంస్థ చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. తమ కళాశాల విద్యార్థుల్లో అంజూరి తారకరామ్ 99.87 పర్సంటైల్, బంటు షణ్ముఖనాయుడు 99.78, కెవి.కుటుంబ నిహార్ 99.70, సిహెచ్.వెంకట హేమ వర్ధన్ 99.66, యు.జయంత్ కుమార్ 99.44, ఎన్.మురళీకృష్ణ 99.30, సిహెచ్ షణ్ముఖసాయి వర్మ 99.22, బోర పవన్‌కుమార్ 99.11 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ఎనిమిది మంది విద్యార్థులు 99 పర్సంటైల్, 37 మంది 98 పర్సంటైల్ పైగా సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను చైర్మన్, డైరెక్టర్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.



అముజూరి తారక్



B SHANMUKHA NAIDU
02-11-2024



K V KUTUMBA NIHAR
02-11-2024



CH V HEMA VARDHAN
02-11-2024



U JAYANTH KUMAR
02-11-2024





CH SHANMUKHA SAI VARMA
02-11-2024



BORA PAVAN KUMAR
02-11-2024

# తీరం..జనసంద్రం..

**-ప్రశాంతంగా మాఘపౌర్ణమి జాతర**

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం:**మండలంలో రేవు పోలవరం తీరంలో మాఘపౌర్ణమి జాతర ప్రశాంతంగా ముగిసింది. బుధవారం తెల్లవారుఝాము నుండి పోలవరం తీరానికి భక్తులు పోటెత్తారు. ఉదయం ఎనిమిది గంటలకే యాభై వేల మంది పుణ్యస్నానాలు ఆచరించగా, మధ్యాహ్నానికి లక్షమంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. పోలీసు రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, మెరైన్, మండల పరిషత్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసి సమన్వయంతో జాతర ప్రశాంతంగా ముగిసిందని నర్సీపట్నం డిఎస్పీ పి శ్రీనువాసరావు తెలిపారు.జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జాతర ఏర్పాట్లపై రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులతో సమీక్షించారు. ప్రశాంత వాతావరణంలో జాతర ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



నక్కపల్లి తీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు

**నక్కపల్లి:**మండలంలోని రాజయ్యపేట ,బోయపాడు సముద్ర తీరాలు మాఘ పౌర్ణమి సందర్భంగా జనసంద్రంతో నిండాయి. బుధవారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు రాజయ్యపేట, బోయపాడు సముద్ర తీరాలకు చేరుకుని సముద్ర స్నానాలు ఆచరించారు. తీర ప్రాంతం జన సంద్రముగా దర్శనమిచ్చింది. సి ఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో సముద్ర తీరం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచారు. ఎంపీడీవో డి సీతారామరాజు పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా వ్యాపారులు తీరంలో తినుబండరాల దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగించారు .



ఎస్.రాయవరం తీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు